క్లుప్తంగా

నీటిఎద్దడి తీర్చాలని వినతి

దోమలపెంట: గ్రామంలో నెలకొన్న నీటి ఎద్దడి సమస్య పరిష్కరించాలని కోరుతూ బుధవారం ఎస్‌ఎల్‌బీసీ ప్రాంగణంలో ఉన్న మిషన్ భగీరథ ఎస్‌ఈ జగన్‌మోహన్‌ను, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను బీఆర్‌ఎస్ నాయకులు మహేష్, ఎడ్లశేఖర్, తిమ్మప్ప, ప్రసాద్‌లు కలిసి వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వంలో గ్రామంలో అధికశాతం మిషన్ భగీరథ పనులు పూర్తయ్యాయని ప్రస్తుతం మిగిలి ఉన్న పనులను త్వరతగతిన పూర్తి చేస్తే గ్రామానికి నీటి సమస్య ఉండదని వివరించారు. సమస్య పరిష్కారానికి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ హేమలత హామీ ఇచ్చారు.

సలేశ్వరం రోడ్డు అభివృద్ధికి సహకరించాలి

అచ్చంపేట రూరల్: నల్లమల అభయారణ్యంలో వెలసిన సలేశ్వర లింగమయ్య దర్శనానికి వెళ్లేందుకు భక్తుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని రోడ్డు అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణను సలేశ్వరం లింగమయ్య దేవస్థాన రోడ్డు అభివృద్ధి కమిటీ సభ్యులు కోరారు. బుధవారం ఎమ్మెల్యేను హైదరాబాద్‌లో రోడ్డు అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మాకం సుధాకర్, చైర్మన్ బళ్లారి సుధాకర్, బల్మూర్ మాజీ జెడ్పీటీసీ సభ్యుడు ధర్మానాయక్ కలిసి వినతి పత్రం అందజేశారు. లింగాల నుంచి సలేశ్వరం వరకు రోడ్డు అభివృద్ధికి సహకరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. అనంతరం సలేశ్వరం రోడ్డు నిర్మాణ కమిటీ పోస్టర్లను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కమిటీ సభ్యులను అభినందించారు.

ఘనంగా ఎన్‌ఎస్‌యూఐ వ్యవస్థాపక దినోత్సవం

అచ్చంపేట రూరల్: పట్టణంలోని రాజీవ్‌చౌరస్తాలో బుధవారం నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు సంతోష్‌నాయక్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల పక్షాన ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు లడ్డుయాదవ్, వినోద్, సోహెల్, అంజి, రామనాథం, చత్రునాయక్ పాల్గొన్నారు.

పంచాయతీ సిబ్బందికి ఘన సన్మానం

ఉప్పునుంతల: మండల కేంద్రంలోని కేదారేశ్వర ఆలయ ఆవరణలో బుధవారం శ్రీరామ నవమి బ్రహ్మోత్సవాల నిర్వాహణ కమిటీ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి వెంకటేష్‌ను, సిబ్బందిని ఘనంగా సన్మానించి నగదు ప్రోత్సాహకాన్ని అందించారు. అదేవిధంగా ఆలయ కమిటీ చైర్మన్ సుగుణమ్మ నారాయణ్‌రెడ్డి దంపతులను, చెన్నకేశవ స్వామి ఆలయ పూజారులను సన్మానించారు. ఉత్సవాల కమిటీ అధ్యక్షులు కొత్త పెద్ద జంగిరెడ్డి, సూరం నారాయణ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, రాంరెడ్డి, సత్యం తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఐగా వెంకటేశ్వర్లు

లింగాల: మండల ఎస్‌ఐగా ఎ.వెంకటేశ్వర్లు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ 5 నెలల పాటు పని చేసిన ఎస్‌ఐ నాగరాజు యాదవ్ నాగర్‌కర్నూలు ఎస్పీ కార్యాలయానికి బదిలీ కాగా ఎస్పీ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న ఎస్‌ఐ ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఏఎస్‌ఐ శ్రీనివాసులు, పోలీసు సిబ్బంది నూతన ఎస్‌ఐకి స్వాగతం పలికారు.

మాదక ద్రవ్యాల నిరోధంపై అవగాహన ర్యాలీ



బల్మూర్: మండలంలోని రాంనగర్‌లో మూడో రోజు ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థుల వేసవి కాల ప్రత్యేక శిబిరంలో భాగంగా బుధవారం మాదక ద్రవ్యాల నిరోధంపై గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి మాదక ద్రవ్యాలు తీసుకోవడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ప్రిన్సిపాల్ పరంగి రవి మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సమన్వయ కర్త డా.జి లక్ష్మాగౌడ్, ప్రోగ్రాం అధికారి బి.జాన్‌బాబు, అధ్యాపకులు డా.దూప్‌సింగ్, డా.కె.అశోక్‌కుమార్, డా.కృష్ణగోపాల్, మల్లయ్య, గాయత్రి, కిరణ్‌కుమార్, బాలరాజు, ప్రేమ్‌నాయక్, హెడ్ కానిస్టేబుల్ వెంకటయ్య, నాగమల్లయ్య, సీహెచ్ ప్రసాద్, ఏఈఓ శిరీష, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కరపత్రాలు విడుదల

తిమ్మాజిపేట: భీమ్ దీక్ష ముగింపు సభకు సంబంధించిన కరపత్రాలను బుధవారం మండల కేంద్రంలో స్వేరోస్ జిల్లా నాయకులు గిద్ద విజయ్‌కుమార్ విడుదల చేశారు. 13న రంగారెడ్డి జిల్లా తలకొండపల్లిలో భీమ్‌దీక్ష ముగింపు సభ ఉంటుందని పేర్కొన్నారు. కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

సూచిక బోర్డులు లేక అవస్థలు

- పట్టించుకోని అధికారులు
- పొంచి ఉన్న ప్రమాదాలు



కల్వకుర్తి రోడ్డులో గౌరారం వద్ద



తెలకపల్లి వద్ద సూచిక బోర్డులేని శ్రీశైలం, మహబూబ్‌నగర్, కల్వకుర్తి ప్రధాన ఆర్‌అండ్‌బీ రోడ్డు

తెలకపల్లి: మండలంలో పలు గ్రామాలకు వెళ్లే రహదారులపై సూచిక బోర్డులు లేక ప్రయాణికుల ఇబ్బందులు పడుతున్నారు. పలు చోట్ల ప్రమాదాల బారిన పడి ఘటనలు ఉన్నాయి. అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రధాన రోడ్డులో..

మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ సమీపం వద్ద 3 ప్రధాన ఆర్‌అండ్‌బీ రోడ్లు ఉన్నాయి. వివిధ ప్రాంతాల నుంచి ఈ రోడ్డు వెంట ప్రయాణికులు రాకపోకలు కొనసాగిస్తుంటారు. కర్ణాటక, రాయలసీమ, మహారాష్ట్రల నుంచే కాకుండా ఉమ్మడి మహబూబ్‌నగర్ నుంచి, అనేక ప్రాంతాల నుంచి వాహనాల్లో, కాలి నడకన శ్రీశైలం నాగార్జునసాగర్ ఇతర ప్రాంతాలకు వెళ్తుంటారు. నాగర్‌కర్నూల్ వైపు నుంచి, అచ్చంపేట వైపు నుంచి వచ్చే ప్రయాణికులు సూచిక బోర్డులు లేకపోవడం వల్ల ఎటువైపు వెళ్లాలో తెలియక కల్వకుర్తి వైపు 10 కి.మీ నుంచి 20 కి.మీ వెళ్లి తిరిగి వస్తున్నారు.

పొంచి ఉన్న ప్రమాదాలు

మండలంలో తెలకపల్లి, కల్వకుర్తి వెళ్లే రోడ్డుతో పాటు తెలకపల్లి నుంచి లింగాల, తెలకపల్లి నుంచి వట్టిపల్లి వెళ్లే రోడ్లలో అనేక చోట్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. తెలకపల్లి, కమ్మరెడ్డిపల్లి గ్రామాల మధ్యన బ్రిడ్జి మలుపు వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడం వల్ల ఎంతో మంది రోడ్డు ప్రమాదాలకు గురై తీవ్ర గాయాలై ప్రాణాలు కోల్పోయిన ఘటనలు ఉన్నాయి. పెద్దూరు ఉన్నత పాఠశాల సమీపంలో నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. సబ్‌స్టేషన్ వద్ద రామగిరి వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయలేదు.

ప్రయాణికుల ఇబ్బందులు...

సుదూర ప్రాంతాల నుంచి వచ్చిపోయే ప్రయాణికులు ఎటు వెళ్లాలో తెలియక ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళల్లో ప్రయాణికులకు సూచిక బోర్డులు కన్పించక గంటల తరబడి వేరే ప్రాంతాలకు వెళ్లి తిరిగి వస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రయాణికుల కోరుతున్నారు.

సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి



వివిధ రాష్ట్రాల నుంచి ఇతర ప్రాంతాల నుంచి వెళ్లే వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. తెలకపల్లి సమీపంలో కల్వకుర్తి, అచ్చంపేట, నాగర్‌కర్నూల్ వెళ్లే రోడ్డుతో పాటు రామగిరి తదితర ప్రదాన చౌరస్తాల్లో సూచిక బోర్డులు లేకపోవడం వల్ల ప్రయాణికులు ఎటు వెళ్లాలో తెలియడం లేదు. అధికారులు నిర్లక్ష్యం వీడి ప్రధాన చౌరస్తాల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి.

– నందిపేట భాస్కర్, తెలకపల్లి

సమస్య పరిష్కరిస్తాం

ప్రధాన ఆర్‌అండ్‌బీ రోడ్ల వెంట సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తాం. నిధులు లేక పోవడంతో బోర్డులు ఏర్పాటు చేయలేదు. త్వరలో ప్రధాన చౌరస్తాల్లో, మలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటాం.

– రమాదేవి, ఆర్‌అండ్‌బీ డీఈ, నాగర్‌కర్నూల్

ఘనంగా కాళికాదేవి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



హాజరైన భక్తులు, దాతలు

ఉప్పునుంతల: మండలంలోని గుట్టమీది తండాలో కాళికాదేవి విగ్రహ, శిఖర, ధ్వజస్తంభ, దొడ్డిపోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు గిరిజనులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మూడు రోజులపాటు కొనసాగిన ఉత్సవాల్లో చివరిరోజు బుధవారం ఉదయం ప్రాతకాల పూజలు, ఉదయం 8.43 గంటలకు యంత్రప్రతిష్ఠాపన అనంతరం కాళికాదేవి అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అనంతరం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనతో పాటు అమ్మవారి విగ్రహ ప్రాణప్రతిష్ఠ, నేత్రోన్మిలనం, కష్మ్యజ్వాల, బలి, పూర్ణాహుతి, కలశోద్వాసన, మహాకుంభాభిషేకం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. మహా మంగళహారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ అనంతరం ఆలయం ఆవరణలో అన్నదానం చేశారు. దాతలు కొత్త యశోద చిన్నజంగిరెడ్డి దంపతులు, అంతటి రాజశేఖర్‌గౌడ్ దంపతులు, అనంత రెడ్డి, నర్సింహారెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు సబావత్ చంద్రునాయక్, రవీందర్‌నాయక్, చందునాయక్, సక్రునాయక్, గోవిందు, తుకారాం, బాలు, బిచ్చానాయక్, జగ్గునాయక్, నాగరాజు, కిషన్, మోహన్ పాల్గొన్నారు.

నేటి నుంచి హనుమాన్ జయంతి వేడుకలు

కల్వకుర్తి రూరల్: పట్టణంలోని హనుమాన్ దేవాలయంలో గురువారం నుంచి మూడు రోజులపాటు హనుమాన్ జయంతి వేడుకలు కొనసాగనున్నాయి. మొదటి రోజు ధ్వజారోహణం, 108 కలశాల పవిత్ర నదుల నీటితో హనుమంతునికి జలాభిషేకం నిర్వహించడంతోపాటు హనుమాన్ చాలీసా పారాయణం చేయనున్నారు. 12న హనుమాన్ జయంతి సందర్భంగా లక్ష తమలపాకుల అర్చన అనంతరం సాయంత్రం శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. భక్తులకు సౌకర్యార్థ చలువ పందిళ్లు వేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు.

డీఈఓ ఆకస్మిక తనిఖీ



పెద్దకొత్తపల్లి: పట్టణంలోని కస్తూర్బా పాఠశాలను బుధవారం డీఈఓ రమేష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో నిర్వహిస్తున్న ఎస్‌ఏ- 2 పరీక్షలను పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యాలను అడిగి తెలుసుకున్నారు. డైనింగ్‌హాల్, కిచెన్ షెడ్లను పరిశీలించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఎస్‌ఓ లతకు సూచించారు. కార్యక్రమంలో నర్సింహులు, లత పాల్గొన్నారు.

పూలే, అంబేడ్కర్ జాతరను విజయవంతం చేయండి

తిమ్మాజిపేట: జిల్లా కేంద్రంలో ఈ నెల 22న నిర్వహించనున్న పూలే, అంబేడ్కర్ జాతరను విజయవంతం చేయాలని జాతర కమిటీ జిల్లా అధ్యక్షుడు శివ ప్రసాద్ కోరారు. మండల కేంద్రంలో బుధవారం మండల ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20 సంవత్సరాలుగా పూలే, అంబేడ్కర్ మహనీయుల జాతరను నిర్వహిస్తున్నామన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

జాతర మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా గిద్ద వెంకటేష్, ప్రధాన కార్యదర్శిగా జోగు శేఖర్, ఉపాధ్యక్షుడిగా రాములు, కుర్మయ్య, కోశాధికారిగా గోపాల్ ఎన్నిక కాగ మరో 10 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు.కార్యక్రమంలో జిల్లా నాయకులు జోగు ప్రదీప్, ఐతోల్ లక్ష్మయ్య, బాలవెంకట్, గోపికృష్ణ, దేవస్వామి, జగన్‌రాజ్, వెంకటేష్, వెంకట్రయ్య,పవీణ్, పర్శరాం, రమాకాంత్ పాల్గొన్నారు.

ఘనంగా బొడ్రాయి పండుగ

కోడేరు: మండలంలోని తుర్కదిన్నెలో బొడ్రాయి పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మాజీ ఎంపీపీ కొత్త రామ్మోహన్‌రావు, అర్చకులు శ్రీరామ ఆచార్యశర్మ ఆధ్వర్యంలో ధ్వజస్తంభం, ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాండేళ్ల సురేష్, చలపతిరావు, చామంతి రాజు, మాజీ వార్డు సభ్యులు ఆదిరాజు, జగన్మోహన్, కుర్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో జాతీయ రహదారిపై ఉన్న విద్యుత్ స్తంభాలను గురువారం షిఫ్టింగ్ చేస్తున్నట్లు దీంతో మధ్యాహ్నం 12 గంటల నుంచి 3:00 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ ప్రదీప్‌గౌడ్ బుధవారం ప్రకటనలో తెలిపారు. చంద్రకల్, సంజీవపూర్, ముస్టిపల్లి, నక్కలపల్లి, మరికల్, పెద్దకొత్లపల్లి, దేవని తిర్మాలాపూర్, జొన్నలబోగుడ, బాచారం పెద్దకార్పముల, అదిరాల, వావిలబావి, చిన్నకొత్తపల్లి, చిన్నకార్పములు, దేదినేనిపల్లి, జగన్నాతంయాపట్ల గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

నిరుద్యోగుల కోసమే రాజీవ్ యువ వికాస పథకం



చారకొండలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

తాడూరు: నిరుద్యోగులకు స్వయం ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం రాజీవ్ యువ వికాస పథకాన్ని ప్రారంభించిందని ఎస్సీ కార్పొరేషన్ డీటీడీఓ ఫిరంగి అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం రూ. 50 వేల నుంచి రూ.4లక్షల వరకు ఆర్థికసాయం అందిస్తుందన్నారు. నిరుద్యోగులు, యువకులు, మైనార్టీలు, ఎస్సీ, ఎస్టీ, బీసీలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ నెల 14వరకు దరఖాస్తులను ఎంపీడీఓ కార్యాలయంలో అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అంజనేయులు కార్యాలయ సిబ్బంది, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రైతు వేదికలో అవగాహన

చారకొండ: మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం రాజీవ్ యువ వికాసం పథకంపై ఎంపీడీఓ ఇసాక్ హుస్సేన్ అవగాహన కల్పించారు. దరఖాస్తులను ఎంపీడీఓ కార్యాలయంలో అందజేయలన్నారు. మండలంలోని ఇప్పటి వరకు 1060 మంది ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. 21 నుంచి 60 సంవత్సరాల వరకు అర్హులని, మహిళలకు 25 శాతం, అంగవైకల్యం 5శాతం అవకాశం కల్పిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఎంపీఓ వెంకటేష్, ఎస్సీ కార్పొరేషన్ అధికారి శ్రీను, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నవగ్రహాల ప్రతిష్ఠ

తాడూరు: మండల కేంద్రంలోని భక్తాంజనేయ స్వామి దేవాలయ ఆవరణలో బుధవారం నవగ్రహ విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఉదయం నుంచి సుప్రభాత సేవ, నవపూజ, యాగశాల, జలాధివాసం, కార్యక్రమాలతో నిర్వహించారు. సిద్ధివినాయక నవగ్రహ నాగదేవత, ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాలను వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణ మధ్య కొనసాగింది. విగ్రహాల ప్రతిష్ఠాపనకు సహకరించిన దాతలు కళావతమ్మ, శ్యాంసుందర్ శర్మల కుటుంబ సభ్యుల గ్రామస్తులు సన్మానించారు.

చంద్ర రాజేశ్వరరావుకు నివాళి

నాగర్‌కర్నూల్ రూరల్: తెలంగాణ సాయుధ పోరాటంలో ప్రజల పక్షాన పోరాటం చేసిన సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, స్వతంత్ర సమరయోధుడు చంద్రరాజేశ్వరరావు స్ఫూర్తితో పోరాటం చేద్దామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం బాల్‌నర్సింహ్మ పిలుపునిచ్చారు. స్థానిక లక్ష్మణచారి భవనంలో చంద్ర రాజేశ్వరరావు 31 వర్థంతి సందర్భంగా నివాళులర్పించారు. సాయుధ పోరాటంలో చంద్ర రాజేశ్వరరావు పాత్ర మరువలేనిదని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర సమితి సభ్యులు పల్లా దేవేందర్‌రెడ్డి, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎం నర్సింహ్మ, శ్రీనివాసులు, శివశంకర్, కిరణ్‌కుమార్, లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులను చిన్నచూపు చూడొద్దు



తెలకపల్లి: దివ్యాంగులను చిన్నచూపు చూడొద్దని డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శ్రీరాం ఆర్యా అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జ్యోతిరావుపూలే బాలుర గురుకుల పాఠశాలను ఆయన సందర్శించారు. జిల్లా న్యాయ సేవా సంస్థ ఆదేశాల మేరకు నల్సా లీగల్ సర్వీస్ పర్సన్ విత్ ఇంటలెక్చువల్ డిజెబులిటిస్ కార్యక్రమం నిర్వహించారు. దివ్యాంగుల చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ సంతోష్, రవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వంట గ్యాస్ ధర తగ్గించాలి

కల్వకుర్తి రూరల్/కొల్లాపూర్/ఉప్పునుంతల: కేంద్ర ప్రభుత్వం వంటగ్యాస్ ధర వెంటనే తగ్గించాలని సీపీఐ కల్వకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరశురాములు డిమాండ్ చేశారు. బుధవారం పెంట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని మహబూబ్‌నగర్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేశారు. అదేవిధంగా కొల్లాపూర్, ఉప్పునుంతలలో సీపీఐ, సీపీఎం నాయకులు నిరసన తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, రాజు, రామస్వామి, ప్రశాంత్, తుమ్మల శివుడు, చింతల నాగరాజు పాల్గొన్నారు



పెద్ద రథోత్సవానికి భారీ బందోబస్తు

చారకొండ: మండలంలోని సిర్సనగండ్ల సీతారామ చంద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి నిర్వహించే రథోత్సవం (పెద్దతేరు)కు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్దండ సీఐ విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలో పోలీస్‌స్టేషన్ ఆవరణంలో ఎస్‌ఐ శంషోద్దీన్ ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ మాట్లాడారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా దాదాపుగా 360 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు. ముగ్గురు సీఐలు, 16 మంది ఎస్‌ఐలు, 40 మంది ఏఎస్‌ఐలు, 300 మంది పోలీసులు, హోంగార్డులు భద్రతా చర్యలో పాల్గొంటారని తెలిపారు. అదేవిధంగా దేవాలయం, జాతర ఆవరణంలో 36 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పోలీసులకు భక్తులు సహకరించాలని కోరారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుదాం



మాట్లాడుతున్న మాజీ ఎంపీ రాములు

ఉప్పునుంతల: స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుదామని మాజీ ఎంపీ పోతుగంటి రాములు పిలుపునిచ్చారు. బుధవారం బీజేపీ మండల అధ్యక్షుడు తోళ్ల మహేష్‌యాదవ్ అధ్యక్షతన నిర్వహించిన పార్టీ క్రియాశీల సభ్యుల సమావేశానికి మాజీ ఎంపీతోపాటు పార్టీ జిల్లా అధ్యక్షుడు వేముల నరేందర్‌రావు, రాష్ట్ర పార్టీ అధికార ప్రతినిధి కట్టా సుధాకర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ మాట్లాడుతూ ప్రతి బూతుల వారిగా కమిటీలను ఏర్పాటు చేసుకొని గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. జిల్లా అధ్యక్షుడు నరేందర్‌రావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. పార్టీ అధికార ప్రతినిధి కట్టా సుధాకర్‌రెడ్డి, నాయకులు సైదులుయాదవ్, శ్రీనునాయక్, రమేష్, సురేందర్‌రెడ్డి, శ్రీహరి, ఖలీల్, శ్రీనివాసులు, వెంకటశెట్టి, శివశంకర్, మండలంలోని పార్టీ క్రియాశీల సభ్యులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు నిర్వహించాలి

లింగాల: అంబేద్కర్ జయంతి సందర్భంగా పలు సేవా కార్యక్రమాలను నిర్వహించాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్‌రావు నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన బీజేపీ క్రియాశీలక సభ్యుల సమావేశంలో ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా క్రియాశీలక సభ్యులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో మండల నాయకులు నవీన్, విష్ణు, కిషోర్, హేమంత్, వెంకటయ్య, చంద్రమోహన్, లింగస్వామి, శివ, మహేష్, రామరాజు, వినయ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

రాంజీ గోండుకు నివాళి

కొల్లాపూర్: పట్టణంలోని ఎస్టీ బాలుర వసతిగృహంలో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో బుధవారం గిరిజన పోరాట యోధుడు రాంజీ గోండు వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా రాంజీ గోండు చిత్రపటానికి బీఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి బి.దాసు, బీఆర్‌ఎస్‌వీ జిల్లా నాయకులు ధార శేఖర్, ఎస్‌ఎస్‌యూ జిల్లా నాయకులు చింటూ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విద్యార్థులు రవి, అంజి, నవీన్, శివ, సురేష్ తదితరులు ఉన్నారు.

ఎస్సీ, ఎస్టీ నిధులపై శ్వేతపత్రం విడుదల చేయాలి

తాడూరు: ఎస్సీ, ఎస్టీ నిధులపై శ్వేతపత్రం విడుదల చేయాలని కేవీపీఎస్ ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని ఎంగంపల్లి గేట్ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు కాశన్న మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు పక్కదారి పడుతున్నాయని ఆరోపించారు. అభయాస్తానికి ఏటా రూ.750కోట్ల నిధుల కేటాయించాలన్నారు. ప్రతి దళిత కుటుంబానికి రూ.12 లక్షలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్ పరశురాం, రాంచంద్రయ్య, రాముడు, తదితరులు పాల్గొన్నారు.

పశువుల సంత రూ. 72 లక్షలు

తెలకపల్లి: మేజర్ గ్రామ పంచాయతీ పశువుల సంత వేలం పాటను బుధవారం గ్రామ పంచాయతీ ఆవరణంలో నిర్వహించారు. వేలంపాటలో బాలగౌడ్ రూ.72 లక్షలకు పశువుల సంతను దక్కించుకున్నారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ వరలక్ష్మీ ఎంపీఓ వెంకటయ్య, భాస్కర్ పాల్గొన్నారు.

నీట మునిగి వివాహిత మృతి

లింగాల: మండల కేంద్రానికి చెందిన వివాహిత మూడావత్ విజయ(35) బావిలోకి దిగి ప్రమాదవశాత్తు నీటి మునిగి మృతి చెందిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం శుభ కార్యంలో వంటలు చేసేందుకు మండలంలోని రాయవరం గ్రామానికి వెళ్లింది. పని ముగించుకొని వస్తూ ఎండ తాపం నుంచి ఉపశమనం పొందేందుకు మార్గమధ్యలో గ్రామ సమీపంలో ఉన్న బావిలో ఈత కొట్టేందుకు బావిలోకి దిగింది. ప్రమాదవశాత్తు నీట మునిగి చనిపోయింది. మృతురాలికి ఒక కుమార్తె ఉంది. ఘటనకు సంబంధించి ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ఉరేసుకుని వ్యక్తి మృతి

కోడేరు: ఉరేసుకుని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన గుంత నిరంజన్(55) ఈ నెల 7న భార్య వెంకటమ్మతో గొడవ పడి ఇంటి నుంచి వెళ్లాడు అప్పటి నుంచి ఎంత వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. బుధవారం ఉదయం తన వ్యవసాయ పొలంలో ఉరేసుకొని కనిపించడంతో కుటుంబసభ్యులు బోరున విలపించారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

హెచ్‌ఎంకు నోటీసు

పెద్దకొత్తపల్లి: కల్వకోల్ ప్రాథమిక పాఠశాల సాయిరెడ్డికి విధుల్లో నిర్లక్ష్యం వహించినందుకు బుధవారం డీఈఓ రమేష్‌కుమార్ నోటీసు జారీ చేశారు. పాఠశాలకు ఇష్టానుసారంగా హాజరవుతున్నట్లు గ్రామస్తుల ఫిర్యాదు మేరకు డీఈఓ విచారణ చేసి ఆయనకు నోటీసు జారీ చేశారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ముగ్గురికి జైలు శిక్ష

నాగర్‌కర్నూల్ క్రైం: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన ముగ్గురికి ఒక రోజు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చినట్లు ఎస్‌ఐ గోవర్ధన్ బుధవారం తెలిపారు. పెద్దాపూర్ గ్రామానికి చెందిన సురేష్, చర్ల ఇటిక్యాల గ్రామానికి చెందిన హుసేన్, కల్వకుర్తికి చెందిన పరశురాములు మద్యం తాగి వాహనం నడుపుతుండగా జిల్లా కేంద్రంలో పోలీసు తనిఖీలలో పట్టుబడ్డారు. వీరిని న్యాయమూర్తి కావ్య ఎదుట హాజరుపర్చగా ముగ్గురికి రూ. 100 చొప్పున జరిమానాతో పాటు ఒకరోజు జైలు శిక్ష విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం



పెంట్లవెల్లి: హామీల అమలులో ప్రభుత్వం విఫలం అయ్యిందని మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించే మహాసభను విజయవంతం చేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు మేనిఫెస్టోలో ఇచ్చిన ఏ ఒక్క హామీని ప్రభుత్వం నెరవేర్చలేదన్నారు. సమావేశంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్ రెడ్డి, పోతుల వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ రాజేష్, ఎస్‌కే ఖాజా, సురేందర్ గౌడ్, విజయరామారావు, రఫియోద్దీన్ పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాలల వసతులపై అవగాహన

పెద్దకొత్తపల్లి: ఉన్నత పాఠశాలలో కల్పించే వసతులపై ప్రాథమిక పాఠశాల 5వ తరగతి విద్యార్థులకు బుధవారం ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి అవగాహన కల్పించారు. పట్టణంలో ఐఎఫ్‌బీ బ్యానర్ ద్వారా విద్యను అందిస్తున్న విధానం, సైన్స్ ల్యాబ్, క్రీడా సామాగ్రి, విద్యార్థులకు అందిస్తున్న పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం రాంపాల్, సీఆర్పీ ఈశ్వర్ పాల్గొన్నారు.

వినికిడి పరికరం అందజేత

వెల్దండ: మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్త అల్లడి రంగయ్య కొంతకాలంగా వినికిడి సమస్యతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న సింగిల్‌విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్యగౌడ్ రూ.25 వేల సొంత ఖర్చుతో బాధితుడికి వినికిడి పరికరం అందజేశారు. మాజీ సర్పంచ్ భూపతిరెడ్డి, నాయకులు తిరుపతిరెడ్డి, పుల్లయ్య, రషీద్, కృపానందం, హమీద్, శ్రీను, మహేష్, రామకృష్ణ, కొండలు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య

చారకొండ: ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందుతోందని ఎంఈఓ రూన్సీరాణి అన్నారు. మండలంలోని తుర్కలపల్లి, నూకలచింతవాడికతండా, సారంబండ తండా తదితర తండాల్లో బుధవారం ఎంఈఓ పర్యటించారు. ఇంటింటికి తిరిగి పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. హెచ్‌ఎం భగవాన్ రెడ్డి, తుర్కలపల్లి హెచ్‌ఎం మహిపాల్ నాయక్, ఉపాధ్యాయులు, కమాలాకర్ రావు, రాజేందర్ రెడ్డి, యాదగిరి, రామకృష్ణ, డాక్యా నాయక్ తదితరులు ఉన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

తెలకపల్లి: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని ఎస్‌ఐ నరేష్ అన్నారు. సీఎల్ మాజీ డైరెక్టర్ నరేందర్‌రెడ్డి జ్ఞాపకార్థ నిర్వహించిన బాడ్మింటన్ పోటీలు ముగిశాయి. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రాజమహేందర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, సుఖజీవన్‌రెడ్డి, పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు పరిశీలన

చారకొండ: మండల కేంద్రంలో ఇందిరమ్మ మోడల్ ఇళ్ల నిర్మాణాన్ని బుధవారం ఎంపీడీఓ ఇసాక్ హుస్సేన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ నిర్మాణానికి త్వరితగతిన నాణ్యతతో పూర్తి చేయాలన్నారు. మండలంలోని గోకారంలో పైలెట్ ప్రాజెక్టులో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు మోడల్ ఇంటి నిర్మాణం ప్రకారం నిర్మించుకోవాలన్నారు. ఎంపీఓ వెంకటేష్, వెంకట్ గౌడ్, మండల అధ్యక్షుడు బాల్‌రాం గౌడ్, తదితరులు ఉన్నారు.